క్లుప్తంగా

నేడు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

తిరుమలాయపాలెం : మండలంలోని పిండిప్రోలులో బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర తదితరులు హాజరవుతారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పి.చంద్రశేఖర్ తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, బీటీ రోడ్లు వంటి పనులు చేపడతారని చెప్పారు.

నివాళి

ఖమ్మంమయూరిసెంటర్: రిటైర్డ్ హెడ్‌మాస్టర్ గండి కోటయ్య సతీమణి విమలమ్మ మృతి పట్ల రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నగరంలోని మామిళ్లగూడెంలో వారి నివాసానికి వెళ్లి విమలమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విమలమ్మ కుమారుడు ఆబ్కారి శాఖ అధికారి శ్యాంబాబును పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఏఎస్పీ రామోజీ రమేష్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జర్నలిస్టుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

నేమినాథ్ స్వామికి జైనుల పూజలు



పూజలు చేస్తున్న జైనులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్ మోహన్‌రోడ్డులో నేమినాథ్ భగవాన్‌కు జైన్ పరివార్‌లు పూజలు చేశారు. మంగళవారం దస్ లక్ష్మణ్ ప్రదూషణ్ పర్వదినం సందర్భంగా జైనులు సంప్రదాయ పద్ధతుల్లో సామూహిక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి కాలా ఇందూజైన్, శీతల్ జైన్, సునిత జైన్, సంజయ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన డీపీఓ

ఖమ్మంవన్‌టౌన్: జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్‌ను జిల్లా పంచాయతీ అధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన హరిక్రిష్ణ మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

వినతి..

ఖమ్మం మామిళ్లగూడెం: ఓబీసీ మహిళా ప్రత్యేక రిజర్వేషన్‌కుఎంబీసీ రాష్ట్ర కమిటీ నుంచి పూర్తి మద్దతు తెలియజేస్తూ మంగళవారం బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ కమిషన్ సభ్యులు ఆంజనేయులుగౌడ్, ఉపేందర్‌లకు తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ రాష్ట్ర కన్వీనర్ షేక్.షకీనా ఆధ్వర్యాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

న్యాయవాదుల పోటీల పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంలీగల్: వచ్చేనెల 6, 7, 8వ తేదీల్లో జరగనున్న న్యాయవాదుల క్రికెట్ పోటీల పోస్టర్లను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. టోర్నీ నిర్వాహకుడు తాళ్లూరి దిలీప్ చౌదరితో కలిసి పోస్టర్లు ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. న్యాయవాదులు ఎక్కిరాల రాంబాబు, ఎం.జే.ప్రవీణ్, రాజేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ అంటోని
వినోద	ది నన్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	7జీ బృందావన కాలనీ
శ్రీనివాస	జవాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	5
వంకాయ	60		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	40		20
కాకర	30	చుక్కకూర	4
బోడ కాకర	100		20
బీర	36	తోటకూర	5
దొండ	20		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	30	మెంతికూర	4
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	46	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	40		20
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

అభివృద్ధిని చూసి ఆదరించండి..

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



6వ డివిజన్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన మేయర్ తదితరులు

ఖమ్మంఅర్బన్: కంటి ముందు, ఇంటి ఎదుట జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌ను, తనను ఆదరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఖమ్మం 11వ డివిజన్ కవిరాజ్ నగర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ బాధ్యులు నూతలపాటి నాగేశ్వరరావు, కార్పొరేటర్ సరిపూడి రమాదేవి ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ఇప్పటికే ఖమ్మం నలుదిక్కులా అభివృద్ధి చేయగా.. మరోమారు గెలవగానే మిలినీయం సిటీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కవిరాజ్ నగర్ సమీపాన ఐటీ హబ్ ఏర్పాటుచేయగా... సర్దార్ పటేల్ మైదానంలో ఉన్న సౌకర్యాలను చూసి అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికల వేళ తప్పుడు హామీలతో వచ్చే వారిని నమ్మొద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్‌తో పాటు గరికపాటి వెంకటేశ్వరరావు, సరిపుడి సతీష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధే లక్ష్యం

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: రాజకీయాలకు అతీతంగా నగరం నలుమూలల అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని.. మరోమారు తనను గెలిపిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. మంగళ వారం ఖమ్మం ఆరో డివిజన్‌లో రూ.1.70 కోట్లతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లు, రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే, రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి, సుడా నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. కార్పొరేటర్ నాగండ్ల కోటి, మేయర్ నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుత్తా రవి పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం..

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను 54వ డివిజన్ మహిళలు సన్మానించారు. ఈ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేయగా కార్పొరేటర్ పైడిపల్లి రోహిణీ సత్యనారాయణ ఆధ్వర్యాన సన్మానించి నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి



సభ్యత్వాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వేతన సవరణ కమిటీ నియమించి మధ్యంతర భృతి ఐఆర్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం పీఆర్‌టీయూ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను, ఉపాధ్యాయులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఆర్‌సీతో పాటు 20 శాతం ఐఆర్ ప్రకటించాలని, బదిలీల ప్రక్రియకు ఎటువంటి అవరోధాలు జరగకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రాములు, సంఘ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, మురళీధర్‌రెడ్డి, జ్యోతి, కోటేశ్వరరావు, మాలిక, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'స్వచ్ఛతా హీ సేవా'

నేలకొండపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పురవీధుల్లో ర్యాలీ తీసి ప్రజలకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొనగా.. మండలంలోని చెరువుమాధారంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీఓ శివ, సర్పంచ్ ఈవూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో నాలుగు లక్షల మంది గిరిజనుల సంక్షేమం,అభివృద్ధి కోసం జిల్లా కేంద్రంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీల బాధ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు గిరిజన సంఘాల బాధ్యులు కలెక్టర్ వీ.పీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి కృష్ణలు మాట్లాడుతూ.. జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు చెందిన గిరిజనులకు ఐటీడీఏ లేకపోవడంతో సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. అలాగే భద్రాచలం ఐటీడీఏ ద్వారా ఖమ్మం జిల్లా గిరిజనులకు ఎలాంటి ప్రయోజనం లేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్నా నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా రామారావు, జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా కృష్ణ నాయక్, భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో సుమన్ షోటోఖాన్ కరాటే ఆధ్వర్యాన ఈ నెల 24వ తేదీన జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఖమ్మంకు చెందిన మహబూబ్ కరాటే స్కూల్ విద్యార్థులతో పాటు ప్రతిభ చాటారు. ఎస్.గణేశ్, బి.భానుప్రసాద్, ఎస్.డీ.అమీర్‌పాషా, వి.మోషీ, ఎస్‌కె.సాజీద్, కె.శ్రీమన్నారాయణ, కె.రాజేష్, బి.ప్రజ్ఞసాయి తేజ్, టి.భవ్యశ్రీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.కాగా, కటా విభాగంలో గ్రాండ్ చాంపియన్‌గా నిలిచిన రెజొనెన్స్ కళాశాలకు చెందిన సయ్యద్ ఆదిల్ పాషాను కళాశాల డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావులు అభినందించారు. అంతేకాక ప్రతిభ చాటిన విద్యార్థులను సీనియర్ కరాటే మాస్టర్ మహబూబ్ కూడా అభినందించారు.

'గృహలక్ష్మి'లో నేతల పెత్తనం ఉండొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ శ్రేణులు

నేలకొండపల్లి: రాజకీయాలకు అతీతంగా గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకంలో అధికార పార్టీ నాయకులు పెత్తనం లేకుండా అర్హత కలిగిన వారికి మాత్రమే మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, షేక్ షరీఫ్దీన్, సయ్యద్ మోహినుద్దీన్, కాళంగి వెంకటేశ్వర్లు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో అవగాహన

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యాన ఇంటర్వ్యూ, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. ప్లేస్‌మెంట్సే లక్ష్యంగా వివిధ రకాల ట్రైనింగ్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, ఏ.వీ.వీ. శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ఆయా మండలకేంద్రాల్లోని పార్టీ, సంఘ కార్యాలయాల్లో ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఐలమ్మ జీవితం నేటి యువతకు ఆదర్శమని, ఆమె పోరాట స్ఫూర్తిలో సమస్యలు సాధించుకోవాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవన్‌టౌన్: క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్,తదితరులు



ఖమ్మంరాపర్తినగర్: జనసేన నాయకుల నివాళి



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు



ఖమ్మంమామిళ్లగూడెం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నివాళి



ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక బాధ్యుల నివాళి

కొనసాగుతున్న సౌత్ జోన్ క్రీడలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో నిర్వహిస్తున్న నగర స్థాయి సౌత్ జోన్ మండల పాఠశాలల క్రీడలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈమేరకు అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో క్రీడలు నిర్వహిస్తుండగా.. అండర్–14 బాలుర ఖోఖోలో న్యూఇరా విన్నర్ జట్టు కాగ, జీహెచ్ఎస్ రాజేంద్రనగర్ రన్నర్‌గా నిలిచింది. కబడ్డీలో శ్రీచైతన్య జట్టు విజేతగా నిలవగా.. రెండోస్థానంలో జీహెచ్ఎస్ కొత్తగూడెం నిలిచింది. త్రోబాల్‌లో హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రథమ, శ్రీచైతన్య స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీలో శ్రీచైతన్య స్కూల్, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నాయి.

విఘ్నాలు తొలగించే వినాయక..

గణపతి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు మంగళవారం వాడవాడలా మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పూజల్లో పాల్గొని తమ విఘ్నాలు తొలగించాలని వేడుకున్నారు. అనంతరం మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి విరాళాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



డీఆర్డీఏ రోడ్డులో పూజా కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



తిరుమలాయపాలెం: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ వరాల శ్రీనివాస్



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పుల్లమ్మ



ఖమ్మంగాంధీచౌక్: ఆటోనగర్‌లో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఖమ్మంఅర్బన్: చైతన్యనగర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చావామాధురి నారాయణరావు



శ్రీరాం హిల్స్‌లో పూజలు చేస్తున్న స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు

11 ఏళ్లుగా గణపతి ఉత్సవాలు..



శ్రీ సిద్ధి వినాయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని రిక్కాబజార్ సుతారివారి వీధిలో 11 ఏళ్లుగా మహిళలు వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈనే పథ్యాన శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ పేరిట ఉత్సవాలను జరపాలని సొంతంగా నిధులను సమకూర్చుకొని ఏటా ఈ వేడుకలను జరుపుతున్నారు. పూజలతో పాటు పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కమిటీలో మాన శ్రీదేవి, వల్లాల స్వప్న, పానుగంటి మణి, అనిశెట్టి ప్రవంతి, బెందరపు శ్రీలత, నరహరి దీప్తి, విజయ, బెందారపు పద్మ, పి.ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కందాళ

ఖమ్మంరూరల్: మండలంలో నేడు జరిగే గణేశ్ నిమజ్జన వేడుకలను నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నాయుడుపేటలోని మున్నేటి నిమజ్జన ప్రాంతాన్ని మంగళవారం రాత్రి ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. పోలీస్ నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఈ విషయమై మండల పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిమజ్జనం గురించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, సీఐ రాజిరెడ్డి, ఏదులాపురం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

దడవాయిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



వినతి పత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే దడవాయిల(వేమెన్స్)ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ దడవాయి సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ దడవాయి యూనియన్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశంకు మంగళవారం వినతిపత్రం అందించింది. వేమెన్స్‌ను మార్కెట్ కార్మికుడిగా గుర్తించి నెలకు రూ.35 వేల వేతనం ఇవ్వాలని, తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ దడవాయి సంఘం అధ్యక్షుడు మోటె కుమార్, ఉపాధ్యక్షుడు మందా అనంతరాములు, కార్యదర్శి దూపా కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కోలా మురళి, కోశాధికారి చిందం సైదులు, కార్యనిర్వాహక కార్యదర్శులు సైదులు, రమణరావు తదితరులు ఉన్నారు.

తుమ్మల పరామర్శలు



ముస్తఫా ఇంట్లో మాజీ మంత్రి తుమ్మల

ఖమ్మం వన్‌టౌన్: నగరంలోని 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజులను మంగళవారం మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల కాలంలో ఓ రహదారి నిర్మాణం కోసం నిరసన తెలిపినందుకు అధికార పార్టీ అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా కార్పొరేటర్ ఆవేదన చెందిన విషయం తెలిసిందే. దీనిపై ఆమెతో మాజీ మంత్రి మాట్లాడారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు ముస్తఫా తల్లి, కొనకంచి సరళ ధర్మేందర్ చిన్న కూతురు, చెరుకూరి శ్రీనివాసరావు తండ్రి రాజారావులు ఇటీవల మరణించగా.. వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. తుమ్మల వెంట సాధు రమేష్‌రెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్‌రావు, జొన్నలగడ్డ రవి, పోటు లెనిన్, నాగండ్ల దీపక్‌చౌదరి, తుపాకుల యలగొండస్వామి, ఎండీ ఖాదర్ బాబు, హనుమంత్‌రెడ్డి, జంగం భాస్కర్, మేదరమెట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ విధానాన్ని వెంటనే రద్దు చేసి 12 రకాల నిత్యావసర సరుకులు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సీపీఐ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బయోమెట్రిక్ పేరుతో పేదలకు ఇచ్చే బియ్యంలో కోత విధించాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చి, నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యనాలి సాంబశివరెడ్డి, జాల నరసింహారావు, ఎస్‌కె.చానా, భద్రం, గుగులోతు శేఖర్‌నాయక్, ఖాదర్ ఉద్దీన్, ఎస్‌కె.రెహ్మాన్, రాజు, ఫాతిమా, కృష్ణవేణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.